

చౌడమ్మ కొండూర్ ఎత్తిపోతల పథకం ట్రాన్స్‌ఫార్మర్ చోరీకి గురై రిపేరు జరిగిన తరువాత బిగిస్తున్న దృశ్యం (ఫైల్ ఫొటో)




**కాయిల్స్, రిపేర్లకు లక్షల్లో ఖర్చు**

ఎత్తిపోతల పథకాల ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి కాయిల్స్ ఎత్తుకెళ్లే దొంగలకు మిగిలేది రూ. 20 నుంచి 30 వేలు మాత్రమే. పంటపొలాల్లోని ట్రాన్స్‌ఫార్మర్ల కాయిల్స్‌కు రూ. 5 వేల లోపే. దొంగతనానికి గురైన ట్రాన్స్‌ఫార్మర్లకు మాత్రం ఎత్తిపోతల దానికి రూ. 10 లక్షలు, పంటపొలాల దానికి రూ. లక్షా 50 వేల భారం ప్రభుత్వంపై పడుతోంది. దొంగతనం జరగ్గానే ట్రాన్స్‌కో సిబ్బంది పోలీసులకు ఫిర్యాదు చేయగా, వారు ఎఫ్ఐఆర్ చేసిన తరువాతే రిపేరు కోసం అనుమతి లభిస్తున్నది. రిపేరు చేయడానికి వారం రోజుల సమయం పడుతుంది. ట్రాన్స్‌ఫార్మర్ మళ్లీ యథాస్థానానికి చేర్చడానికి మొత్తం వారం నుంచి పది రోజుల సమయం పడుతున్నది.



**వ్యవసాయ క్షేత్రాల్లో చోరుల పంజా**

# ట్రాన్స్‌ఫార్మర్ దొంగలు

- ట్రాన్స్‌ఫార్మర్ల ధ్వంసం.. కాపర్ వైర్, ఆయిల్ అపహరణ
- 'ఎత్తిపోతల' నియంత్రికలకూ రక్షణ కరవు
- మధ్యాహ్నం రెక్కీ.. రాత్రివేళ చోరీ
- ఉమ్మడి జిల్లాలో తరచూ ఘటనలు
- దొంగలకు వచ్చేది గోరంత.. రైతులకయ్యే ఖర్చు బోలెడంత

నందిపేట్, అక్టోబర్ 8: కాపర్ వైర్, ఆయిల్ దొంగలు రెచ్చిపోతున్నారు. నిశీధిలో వ్యవసాయ క్షేత్రాల్లో విధ్వంసం సృష్టిస్తున్నారు. ఫలితంగా ఉమ్మడి జిల్లాలోని ట్రాన్స్‌ఫార్మర్లకు రక్షణ లేకుండా పోయింది. ఎత్తిపోతల పథకాల్లోని నియంత్రికలను సైతం కొల్లగొడుతుండడం కలకలం రేపుతున్నది. ఇటీవలి కాలంలో ట్రాన్స్‌ఫార్మర్ల ధ్వంసరచన బాగా పెరిగి పోయింది. ప్రధానంగా జాతీయ రహదారులతో పాటు రోడ్లకు పక్కనున్న నియంత్రికలే లక్ష్యంగా దుండగులు రెచ్చిపోతున్నారు. కేవలం కాపర్ వైర్ కాయిల్స్, ఆయిల్ కోసం దొంగతనాలకు తెగబడుతున్నారు. వ్యవసాయ క్షేత్రాలే కాకుండా ఎత్తిపోతల పథకాల వద్ద ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్లనూ వదలడం లేదు. ఇలా ఎత్తుకెళ్లిన కాయిల్స్‌ను బయట అమ్మితే వారికి దక్కేది రూ.వేలల్లో మాత్రమే. కానీ ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులకయ్యే ఖర్చు మాత్రం తడిసి మోపెడవుతున్నది. పైగా మరమ్మతులకు పదిరోజులకు పైగా సమయం పడుతుండడంతో అప్పటి వరకూ పంటలకు నీటి విడుదల నిలిచి పోతున్నది. నందిపేట్ సహా వివిధ మండలాల్లో ఎక్కడో ఒకచోట చోటు చేసుకుంటున్న ట్రాన్స్‌ఫార్మర్ల ధ్వంసం కేసులు పోలీసులకు సవాల్ మారుతున్నాయి. మహారాష్ట్రకు చెందిన ముఠానే ఈ చోరీలకు పాల్పడుతున్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

## మూడు లిఫ్ట్‌ల వద్ద ట్రాన్స్‌ఫార్మర్ల చోరీ

మండలంలోని చౌడమ్మ కొండూర్, దత్తాపూర్, తల్వేద ఎత్తిపోతల పథకాల మొదటిస్టేజీ పంప్ హౌస్ వద్ద ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్లను గత జూన్‌లో దొంగలు ధ్వంసం చేసి, అందులోని కాపర్ (రాగి) కాయిల్స్‌ను ఎత్తుకెళ్లారు. వారం రోజుల వ్యవధిలో మూడుచోట్ల దొంగతనాలు జరిగాయి. ట్రాన్స్‌ఫార్మర్లను గద్దెపై నుంచి కిందికి పారేయడంతో అవి పూర్తిగా దెబ్బతింటున్నాయి. కాయిల్స్ తోపాటు రిపేర్ చేయడానికి ఒక్కో ట్రాన్స్‌ఫార్మర్‌కు సుమారు రూ. 10 లక్షల ఖర్చు అవుతున్నదని నీటిపారుదల శాఖ అధికారులు చెబుతున్నారు. లిఫ్ట్‌లపై రూ.లక్షల్లో భారం పడుతుండడంతో తల్వేద, చౌడమ్మ కొండూర్ ఎత్తిపోతల ట్రాన్స్‌ఫార్మర్లను రిపేరు చేయించి నడుపుకుంటున్నారు. దత్తాపూర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను మాత్రం ఇంకా రిపేరు చేయించకపోవడంతో లిఫ్టు నడవడం లేదు. అలాగే గడిచిన ఈ నాలుగు రోజుల్లో పంటపొలాల్లోని మూడు ట్రాన్స్‌ఫార్మర్లు చోరీకి గురయ్యాయి. కంఠం గ్రామ శివారులో రెండు, చౌడమ్మ కొండూర్‌లో దుండగులు ఒక ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి, అందులోని కాపర్‌ను ఎత్తుకెళ్లారు.

## పగలు రెక్కీ.. రాత్రి చోరీ

నందిపేట్ మండలంలో ఇటీవల వరుసగా ట్రాన్స్‌ఫార్మర్లను కొల్లగొట్టారు. రోజుల వ్యవధిలోనే మూడింటిని ధ్వంసం చేసి కాపర్ వైరు, ఆయిల్ ఎత్తుకెళ్లారు. ఈ ఘటన మరువక ముందే బోధన్ మండలంలోని రాజీవ్‌నగర్ తండా శివారులో గల 25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను, గ్రామ శివారులోని గల 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను సైతం ధ్వంసం చేసి రాగి తీగలను దొంగిలించారు. దుండగులు మధ్యాహ్న సమయంలో రెక్కీ నిర్వహించి, రాత్రివేళ దొంగతనాలకు పాల్పడుతున్నారు. మహారాష్ట్ర నుంచి వస్తున్న వారే నందిపేట్‌లో చోరీలు చేస్తున్నట్లు అనుమానిస్తున్నారు. ఉమ్మెడ వద్ద గోదావరి నదిపై వంతెన నిర్మాణం పూర్తికావడంతో మహారాష్ట్ర ప్రాంతానికి దూరభారం తగ్గిపోయింది. దీంతో నందిపేట్ ప్రాంతంలో కొత్త వ్యక్తుల సంచారం పెరిగింది. బైక్‌లు, మార్కెట్‌లో చిల్లర దొంగతనాలు పెరిగిపోయాయి. మహారాష్ట్ర ప్రాంతానికి చెందినవారు ఇక్కడ దొంగతనాలకు పాల్పడుతూ.. వంతెన మీదుగా చాకచక్యంగా తప్పించుకుంటున్నట్లు తెలుస్తోంది. వంతెన వద్ద పోలీసు తనిఖీలు కూడా లేకపోవడం దుండగులకు అడ్డూ అదుపులేకుండా పోయింది. ఇప్పటికైనా వంతెన వద్ద తనిఖీలు చేస్తే చోరీలను అరికట్టవచ్చని, ఆ దిశగా పోలీసులు ప్రయత్నాలు చేయడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

### ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశాం..

"ట్రాన్స్‌ఫార్మర్ల దొంగలను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశాం. పాత నేరస్తులను విచారించి, వారిపై నిఘా ఉంచాం. మాకు దొరికిన ఆధారాలకు అనుగుణంగా దొంగలను పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నాం. మండలంలో దొంగతనాలు అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

**-హరిబాబు, నందిపేట్ ఎస్సై**



ఉమ్మెడ సమీపంలోని పంటపొలాల్లో దొంగతనానికి గురైన ట్రాన్స్‌ఫార్మర్ (ఫైల్)



దసరా నవరాత్రోత్సవాల్లో భాగంగా కొలువుదీరిన శక్తి స్వరూపిణిని భక్తులు రోజుకో అవతారంలో ఆరాధిస్తున్నారు. నందిపేట్ మండలంలో రూ.1.50 కోట్ల నగదుతో అలంకరించి మహాలక్ష్మీ దేవిగా అమ్మవారిని అలంకరించి పూజించారు. – నందిపేట్

# సన్న, దొడ్డు రకాలు వేర్వేరుగా సేకరించాలి

**జిల్లా కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్**

కామారెడ్డి, అక్టోబర్ 8 : వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని, సన్న, దొడ్డు రకాల ధాన్యాన్ని విడివిడిగా సంచుల్లో నింపాలని జిల్లా కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పాక్స్ సీఈవోలు, ఐకేపీ సెంటర్ ఇన్‌చార్జీలు, వ్యవసాయ శాఖ విస్తరణ అధికారులు, మండల వ్యవసాయాధి కారులు , వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులకు ధాన్యం కొనుగోళ్లపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాలకు రైతులు తీసు కవచ్చే ధాన్యాన్ని పరిశీలించి సన్న, దొడ్డు రకాలను విడివిడిగా నింపాలని తెలిపారు. ప్రతి సంచిపై సెంటర్ కోడ్, జిల్లా కోడ్ వేయాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో తాగునీరు, టెంట్, గన్నీ బ్యాగ్స్ తదితర ఏర్పాట్లు ముందస్తుగా చేసుకోవాలని తెలిపారు. వర్షాలకు ధాన్యం తడవకుండా ఉండేం దుకు ప్రతి కేంద్రంలో టార్పలిన్లు అందుబాటులో ఉంచాలన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్త కూడదని తెలిపారు. కొనుగోలు చేశాక ట్యాగ్ చేసిన మిల్లులకు ధాన్యాన్ని తరలించాలని అన్నారు. ఈ సమావేశంలో పౌరసరఫరాల జిల్లా మేనేజర్ రాజేందర్, జిల్లా వ్యవసాయ అధికారి తిరుమల ప్రసాద్, సహాయ పౌర సరఫరాల అధికారి నరసింహారావు, జిల్లా సహకార అధికారి తదితరులు పాల్గొన్నారు.



## అధినేతతో భేటీ

**బీఆర్ఎస్** అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌ను నిజామాబాద్ రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ , మాజీ ఎమ్మెల్సీ వీజీ గౌడ్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు.
–ఖలీల్‌వాడి, అక్టోబర్ 8



## కళల కాణాచి ఇందూరు

**సరికొత్త నృత్య రీతులతో** ఇందూరు పులకించింది. నగరంలోని రాజీవ్‌గాంధీ ఆడిటోరియంలో మంగళవారం జరిగిన అందెల రవళి సంగీత నృత్య ప్రదర్శన ఆద్యంతం ఆకట్టుకుంది. అంతకుముందు ఈ కార్యక్రమాన్ని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తాప్రారంభించారు. ఇందూరు కళలకు, కళాకారులకు పెట్టిందని పేర్కొన్నారు. – సుభాష్‌నగర్, అక్టోబర్ 8

## పూల సింగిడి.. ఊరూర సందడి



**జిల్లాలో బతుకమ్మ** వేడుకలు ఘనంగా సాగుతున్నాయి. తొమ్మిది రోజుల పాటు సాగే ఈ పూల పండుగ ఊరూర సరికొత్త సందడిని తీసుకొచ్చింది. మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన వేడుకల్లో కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్, ఇతర అధికారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. మహిళా ఉద్యోగులు బతుకమ్మ చుట్టూ తిరుగుతూ పాటలు పాడుతూ ఆకట్టుకున్నారు.



నస్రుల్లాబాద్‌లో..

# కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యమివ్వాలి

**సఫాయి కర్మచారి జాతీయ కమిషన్**




సమావేశంలో మాట్లాడుతున్న సఫాయి కర్మచారి కమిషన్ సభ్యుడు వావా

కంఠేశ్వర్, అక్టోబర్ 8: నిత్యం ప్రజల ఆరోగ్యాలను పరిరక్షించే విధుల్లో నిమగ్నమై ఉండే పారిశుద్ధ్య కార్మికుల భద్రత, సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యమివ్వాలని సఫాయి కర్మచారి జాతీయ కమిషన్ సభ్యుడు డాక్టర్ పి.పి వావా సూచించారు. పారిశుద్ధ్య కార్మికులకు అమలవుతున్న సంక్షేమ కార్యక్రమాలపై ఆయన మంగళవారం కలెక్టరేట్‌లో ఉన్నతాధికారులతో సమీక్షించారు. జిల్లాలో ఎక్కడా మాన్యువల్ స్కావెంజర్స్ లేరని, స్కావెంజర్ నిషేధ చట్టం పకడ్బందీగా అమలవుతున్నదని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు కమిషన్ దృష్టికి తీసుకొచ్చారు. నిజామాబాద్ నగర పాలక సంస్థ, బోధన్, ఆర్మూర్, భీమ్‌గల్ మున్సిపాలిటీలు సహా 530 గ్రామ పంచాయతీల పరిధిలో పారిశుద్ధ్య కార్మికులు ఇంటింటి నుంచి చెత్తను సేకరించి వాహనాల ద్వారా డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారని వివరించారు.

కార్మికుల పిల్లలకు బెస్ట్ అవైలేబుల్ స్కీం కింద కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఉచితంగా, నాణ్యమైన విద్య అందిస్తున్నామన్నారు. అంబేద్కర్ ఓవర్సీస్ పథకం కింద విదేశాల్లో చదవడానికి రూ.20 లక్షల వరకు ఆర్థిక చేయూతనిస్తున్నామని వివరించారు. సఫాయి కార్మికులకు సంబంధించి జిల్లాలో గత 16 సంవత్సరాల నుంచి ఎలాంటి అట్రాసిటీ కేసు నమోదు కాలేదని సీపీ కల్మేశ్వర్ తెలిపారు. కేంద్ర సామాజిక న్యాయ విభాగం సభ్యుడు గిరేందర్ నాథ్, కో-ఆర్డినేటర్ చరణ్, అదనపు కలెక్టర్ అంకిత్, మున్సిపల్ కమిషనర్ మకరంద్, అధికారులు పాల్గొన్నారు.

# సమస్యలు పరిష్కరించాలని ఆందోళన

కామారెడ్డి, అక్టోబర్ 8: జిల్లా కేంద్రంలోని కల్కీనగర్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కాలనీ వాసులు మంగళవారం మున్సిపల్ కార్యాలయం ఎదటు ఆందోళన చేపట్టారు. కాలనీకి చెత్త బండి రావడం లేదని, దీంతో మూడు నెలల నుంచి చెత్త పేరుకుపోయి దుర్వాసన వస్తుందన్నారు. వీధీ దీపాల మరమ్మతులు లేక ఆర్నెళ్లు అయిపోయాయని, కల్కీనగర్ సమస్యలపై శ్రద్ధ పెట్టడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యలు పరిష్కరించక పోతే మున్సిపల్ ఆఫీసును ముట్టడిస్తామని హెచ్చరించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ సుజాతను కలిసి వినతిపత్రం అందజేశారు.



మున్సిపాలిటీ ఎదుట మాట్లాడుతున్న కల్కీనగర్ కాలనీ వాసులు